ప్రజాశక్తి

సోమవారం 29 జనవరి 2024 5

అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

పంటనష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

నేడు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రైతుల సమస్యలపై ముఖ్యంగా పంటనష్టపరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై జిల్లాలోని ఆయా తహశీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో జరిగిన సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్ తెలిపారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా ఇటీవల మృతిచెందిన సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు సి పెద్దన్న, ఇరిగేషన్ యూనియన్ నాయకులు సంజీవప్పకు జోహార్లు అర్పించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్, అంగన్వాడీ, ఎస్ఎస్సి, శ్రీరామి రెడ్డి వాటర్ వర్క్ కార్మికులు చేసిన సమ్మెలకు సిపిఎం అభినందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా పట్టుదలతో సమ్మెను కొనసాగించి విజయాలను సాధించిన అంగన్వాడీ మహిళలు రానున్న ప్రజా పోరాటాలకు ఆదర్శంగా నిలిచారని ఆయన అన్నారు. జిల్లాలో గత ఖరీఫ్, రబీ సీజన్లో పెద్ద ఎత్తున పంటలు నష్టపోయాయని వేల కోట్ల రూపాయలు పెట్టుబడి రూపంలో రైతులు నష్టపోయారని తెలిపారు ఎకరాకు రూ. 50 వేలు పంట నష్ట పరిహారం ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో అనేక రూపాల్లో ఆందోళన చేసిన తర్వాత ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని గుర్తు చేశారు. 1,79,815 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు సుమారుగా రూ.6వేల కోట్ల రూపాయలకు పైగా నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు కేవలం రూ.6వేలు చొప్పున గరిష్టంగా రెండు హెక్టార్ల వరకు మాత్రమే పంట నష్ట పరిహారాన్ని ప్రకటించిందని విమర్శించారు. జిల్లాకు ప్రకటించిన రూ. 251 కోట్ల రూపాయలు సంక్రాంతి పండుగ నాటికి రైతు ఖాతాలకు జమ చేస్తామని చెప్పారని ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాలో జమ కాలేదని విమర్శించారు. ఈనెల 23న జిల్లా పర్యటన వచ్చిన ముఖ్యమంత్రి పంట నష్టపరిహారం గురించి ఏమీ మాట్లాడకపోవడాన్ని చూస్తుంటే పరిహారం చెల్లింపుపై అనుమానాలకు తావునిస్తుందన్నారు. రైతులు తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోయారన్నారు. వర్షాలు రాకపోవడంతో పాటు తుంగభద్ర డ్యామ్‌లో నీరు అడుగంటి పోవడంతో ఈ సంవత్సరం బోర్ల కింద వ్యవసాయం కూడా ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడానికి పంటనష్ట పరిహారం, ఇన్సూరెన్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల ఎదురుగా సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో రైతులు, కూలీలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల రంగయ్య, ఎస్ నాగేంద్ర కుమార్, వి. సావిత్రి, బి. శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, భాస్కర్, రామిరెడ్డి, మన్నీల రామాంజనేయులు, నిర్మల, వెంకటనారాయణ, ముస్కిన్, శివశంకర, పోతులయ్య, చెన్నారెడ్డి, నాగేంద్ర, సాకే నాగరాజు, పరమేష్, బాలకృష్ణ, ముత్తుజా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

శాస్త్రీయ ఆలోచనలపై చైతన్యం తీసుకురావాలి

జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శాస్త్రీయ ఆలోచనలపై ప్రజల్లో చైతన్యం కల్పించినప్పుడే వైజ్ఞానిక సమాజ నిర్మాణం సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.ఎం.గేయానంద్ అన్నారు. ఆదివానం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న జెవివి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు చాలా నష్టపోతున్నారన్నారు. కొన్నిసార్లు ప్రాణాల మీది కూడా తెచ్చుకుంటున్నారన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలే ప్రజలను మూఢ విశ్వాసాల వైపు మళ్లిస్తుండటం బాధాకరమన్నారు. కావున ప్రజలను శాస్త్రీయ విజ్ఞానం వైపు మళ్లించాలని సూచించారు. అనంతరం జెవివి డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కార్యదర్శి కెంచా లక్ష్మీనారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జిలాన్‌బాషా, నాయకులు సురేష్, రామిరెడ్డి, వీరరాజు, కె.పి.చితప్ప, సాకే లక్ష్మీనారాయణ, ముత్యాలు, ప్రసాద్, శివ చరణ్, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

పేట్రేగిన మట్టి మాఫియా..!!

వాటాలా.. ఒత్తిళ్లా..?

అధికారుల తీరుపై అనుమానాలు

చెరువుల్లో, ఖాళీ స్థలాల్లో సైతం తవ్వకాలు

హిందూపురం రూరల్ మండలంతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాతో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న మట్టి వ్యాపారంపై అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువుల్లోనే కాకుండా ఖాళీ స్థలాల్లో సైతం అధికార పార్టీ నాయకులు, వారి అండదండలు ఉన్న కార్యకర్తలు ఏకంగా జెసిబిలను పెట్టి మరి ఇష్టారీతిన తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు పక్కా సమాచారం అందించినప్పటికి వారిపై కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో అధికారుల తీరుపై పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో సంబందిత అధికారులకు వాటాలు అందుతున్నాయా లేదా ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

చెరువులను చెరపట్టి ఇష్టారీతిన తవ్వకాలతో చెలరేగుతున్న మట్టి మాఫియాపై చర్యలు లేవు. చెరువులను ఇష్టం వచ్చినట్లు పట్టపగలు సైతం తవ్వుతున్నారు. మట్టి తరలిస్తున్నాని గ్రామస్తులు ఫిర్యాదులు చేస్తున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వినపడుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా యంత్రాలు పెట్టి నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు మట్టిని తరలిస్తున్నప్పటికి అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మట్టి మాఫియాకు ముకుతాడు వేయాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు ఎవరికి వారు యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. తలా పాపం తిలా పిడికెడు అన్న చందంగా వాటాలు పంచుకుంటున్నారన్న ఆరోపణలుకూడా బలంగా వినపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మట్టి తవ్వకాలు, తరలింపులపై ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని దీన్ని బట్టి చూస్తూ వారిపై ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో ఇట్టే స్పష్టమవుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికార పార్టీ అండదండలు ఉన్నా వారు ఇన్నాళ్లు ఇసుక, గ్రావెల్, ఇతర గనులను దోచేసిన వారు ఇప్పుడు చెరువుల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న మట్టిపై పడ్డారు. గత నెల వరకు హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడ సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో జెసిబిలను ఏర్పాటు చేసి, టిప్పర్‌ల ద్వారా ఏకంగా కర్నాటక ప్రాంతానికి తరలించారు. తాజాగా ఆదివారం చౌళూరు పంచాయతీ కారుడిపల్లి గ్రామ చెరువులో జెసిబి పెట్టి ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని ఓ అధికార పార్టీకి చెందిన వ్యక్తి చెరువులో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. చెరువులతో పాటు ఖాళీ స్థలాల్లో మట్టి కోసం పెద్ద పెద్ద గుంతలు పెట్టారు. చిన్న పాటి వర్షానికే ఆ గుంతల్లో నీళ్లు నిలబడే ప్రమాదం ఉంది. ఇలా నీరు నిలబడి, ఆ గుంతల్లో ఎవరైన పడితే ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయి. నిబంధనల ప్రకారం చెరువులో పూడిక ఎక్కువగా ఉంటే దానిని తొలగించేందుకు ఇరిగేషన్ శాఖ అనుమతి ఇస్తుంది. ఒకవేళ ఇళ్ల నిర్మాణాల కోసం మట్టి అవసరమైతే హౌసింగ్ శాఖ ఇండెంట్ ఇవ్వాలి. తహశీల్దారు పాత్ర కూడా ఇందులో ఉంటుంది. ఆ తర్వాత మైనింగ్ శాఖ ఎన్‌ఒసిలు ఇవ్వాలి. మట్టి తవ్వేటప్పుడు పోలీసు శాఖ నిఘా పెట్టాలి. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న మట్టి తవ్వకాల్లో ఈ నిబంధనలేవి పాటించడం లేదని తెలుస్తోంది. దీనిపై మైనింగ్ అధికారులు తమకేమీ తెలియదని చెబుతున్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో సిబ్బంది కొరత ఉందంటూ తప్పించుకునే ధోరణిని కనబరుస్తున్నారు. మైనింగ్ విజిలెన్స్ కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు మట్టి మాఫియాపై ఒక్కటంటే ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవడం, ఎక్కడా అడ్డుకోకపోవడం లాంటివి పరిగణనలోకి తీసుకుంటే ఆయా శాఖల అధికారులకు ఇందులో వాటాలు ఉన్నాయన్న అనుమానాలు కలుగుతున్నాయి. లేకుంటే పెద్దఎత్తున అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు అయినా ఉండి ఉండాలి. ఈ నేపథ్యంలో మట్టిమాఫియాకు వ్యతిరేకంగా ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులు న్యాయపోరాటానికి సన్నద్ధమౌతున్నట్లు సమాచారం. ఇప్పటికైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పారిశ్రామిక వాడలో జెసిబితో మట్టిని తవ్వి, తరలిస్తున్న దృశ్యం

కారుడిపల్లి గ్రామ చెరువులో ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పోరాటాలకు స్ఫూర్తి పెద్దన్న జీవితం

స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కామ్రేడ్ సి. పెద్దన్న సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

పీడిత ప్రజల పక్షాల పోరాటాలు చేసిన కామ్రేడ్ పెద్దన్న జీవితం స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సి. పెద్దన్న సంస్మరణ సభ సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురంలోని రజక నగర్‌లో ఆదివారం నిర్వహించారు. రజక నగర్ లో తాత్కాలికంగా నిర్మించిన స్తూపం దగ్గర వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిపిఐ (ఎం.ఎల్)పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు నాయకులు, ప్రజలు నివాళులు అర్పించారు. అనంతరం కమ్యూనిటీ హాలులో సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు ఎస్. ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడారు. ఈసందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ మార్క్సిజాన్ని తాత్విక దృక్పథంగా స్వీకరించిన కామ్రేడ్ పెద్దన్న పీడిత ప్రజా ఉద్యమ నాయకుడుగా ఎదిగిన తీరును వివరించారు. పెద్దన్నతో వున్న జ్ఞాపకాలను, అనుభవాలను, పోరాటపటిమను గుర్తు చేసుకున్నారు. సిపిఐ (ఎం.ఎల్) కేంద్ర నాయకులు గుర్రం విజయ్ కుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ పెద్దన్న పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ఈ వ్యవస్థ మార్పు కోసం కమ్యూనిస్టుగా బాధితుల, పీడితుల ఆర్తికి గొంతుకనిచ్చి తన ప్రయాణాన్ని సాగించారన్నారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా మాట్లాడుతూ ఆత్మగౌరవంతో, పోరాట పటిమతో చివరిదాకా కమ్యూనిస్టుగా పెద్దన్న జీవించారని అన్నారు. సిపిఐ (ఎం.ఎల్) కేంద్ర కమిటీ సభ్యులు ప్రసాద్ మాట్లాడుతూ గూడు లేని పేద ప్రజల కోసం అనేక కాలనీలు నిర్మించారని, శ్రామిక ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే మన కర్తవ్యమని అన్నారు. ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. కిషోర్ బాబు ప్రసంగిస్తూ కమ్యూనిస్టు సమాజ స్థాపన లక్ష్యంగా పనిచేసిన పెద్దన్న చివరి శ్వాస వరకు తన ఆశయం కోసం లక్ష్యం పోరాడారని, త్యాగం చేశారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గేయానంద్, నాయకులు తరిమెల అమర్నాథరెడ్డి, రంగన్న, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, చాగనూరు మల్లికార్జున రెడ్డి, ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు గణేష్ పండా, స్త్రీ విముక్తి సంఘటన ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి, సిపిఎం రాష్ట్ర నాయకులు జి. ఓబులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, అనంతపురం నగర డిప్యూటీ మేయర్ కోగటం భాస్కర్ రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు నారాయణస్వామి, పిడిఎస్ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, తెలుగుగంగ హెచ్ఆర్ వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్, పెద్దన్న కుమారుడు ప్రమోద్ కుమార్, కుమార్తె శశి తదితరులు ప్రసంగించారు. సభలో కళాకారులు కామ్రేడ్ పెద్దన్న జీవితంపై రాసిన పాటలు, ఎర్రజెండా పాటలు ఆకట్టుకున్నాయి.

రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

నార్పల : కలింగర పంటను సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బండ్లపల్లి గ్రామంలో నాసిరకం కళింగర విత్తనాలతో దిగుబడి రాక నష్టపోయిన పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లపల్లి గ్రామంలో దాదాపు 10 మంది రైతులు 25 ఎకరాల్లో అప్పులు చేసి అనంతపురంలో ఉన్న రేవతి ఫర్టిలైజర్స్ దుకాణంలో కళింగర విత్తనాలు తెచ్చి సాగు చేశారన్నారు. అనంతరం పంటకు మండలంలోని ఎరువుల దుకాణాల్లో పురుగు మందులు తెచ్చి పిచికారి చేశారన్నారు. అయితే 60 రోజుల్లో పంట కోతకు రావాల్సి ఉండగా 80 రోజులైనా దిగుబడి రాకపోవడం బాధాకరమన్నారు. దీంతో లక్షల్లో నష్టపోయారన్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి నకిలీ విత్తనాలు ఇచ్చిన రేవతి దుకాణాన్ని వెంటనే సీజ్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు వెంకటనారాయణరెడ్డి, మల్లేశ్వరమ్మ, లక్ష్మీనారాయణ, మధుసూధన్‌రెడ్డి, మల్లిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాల భద్రతకు చర్యలు

జిల్లా టూరిజం శాఖ ఏడీ నాగేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి- పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా చారిత్రక కట్టడాలకు, పర్యాటక ప్రదేశాలకు నిలయమని వీటి భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా టూరిజం శాఖ ఏడీ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : శ్రీ సత్యసాయి జిల్లాలో టూరిజం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: సత్య సాయి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. పెనుగొండ, లేపాక్షి పుట్టపర్తి, హేమావతి, తిమ్మమ్మ మర్రిమాను, యోగివేమన ప్రసిద్ధి చెందిన ప్రాంతాలు. వీటి అభివృద్ధికి పలు చర్యలు చేపడుతున్నాం. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా పెనుగొండ కొండపైకి రహదారి ఏర్పాటు, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నిర్మాణానికి చర్యలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో రెస్టారెంట్ల నిర్వాహణ, పర్యాటకులకు విడిది గృహాలు తదితర సౌకర్యాలను ఆయా పర్యాటక ప్రాంతాల్లో చేపడుతున్నాం.

ప్ర : పెనుకొండ కొండపైకి రోప్ వే నిర్మాణం ఎప్పుడు చేపడతారు..?

జ : ఆంధ్రప్రదేశ్లో ఎక్కడా లేనటువంటి శిల్ప సంపద పెనుగొండ కోట చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంది. పెనుగొండ పట్టణం చారిత్రక పట్టణంగా గుర్తించాం. పర్యాటక ప్రదేశాలను కాపాడడానికి ఎన్నో చర్యలు చేపడుతున్నాం. వీటిని అభివృద్ధి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు వెచ్చించనున్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి కొండపైకి రోప్‌వే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారుల

ఆదేశాలమేరకు రోపేవే నిర్మాణం జరిగితే పర్యాటక రంగంగా పెనుగొండ మరింత అభివృద్ధి చెందుతుంది.

ప్ర : పుట్టపర్తిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి కొత్త ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా.?

జ : పుట్టపర్తిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. శ్రీ సత్య సాయి బాబా మందిరంతో పాటు చుట్టుపక్క ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నాం. సత్యసాయి దర్శనార్థం ఎంతోమంది దేశ విదేశీయులు భక్తులు పుట్టపర్తికి వస్తుంటారు. వారిని దృష్టిలో ఉంచుకొని పుట్టపర్తి పరిసర ప్రాంతాలైన చిత్రావతి నది బ్యూటిఫికేషన్, బుక్కపట్నం చెరువు అభివృద్ధి పనులు, అందులో బోటింగ్, శిల్పారామం తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాలను సుందరీకరణంగా తీర్చిదిద్దడానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపాం.

ప్ర : కొత్త టూరిజం సర్క్యూట్‌కు ఎలాంటి చర్యలు

తీసుకుంటున్నారు.?

జ : పుట్టపర్తి, పెనుగొండ, లేపాక్షి, కదిరి, తిమ్మమ్మమర్రిమాను, యోగివేమన తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక పర్యాటక బస్సును ఏర్పాటు చేసి పుట్టపర్తి నుండి ఉదయం బయలుదేరి రాత్రి లోపు వీటన్నింటిని తిరిగి వచ్చే విధంగా కొత్త టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని చర్యలు చేపడుతున్నాం. దీనివల్ల తక్కువ ఖర్చుతో పర్యాటక ప్రాంతాలను ప్రజలు వీక్షించేందుకు అవకాశం కలుగుతుంది. ఈ టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నాము. కేంద్రం నిధులతో సత్యసాయి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి మరింత కృషి చేస్తాం.

అటకెక్కిన 'ప్రాజెక్టు అనంత'

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిసిసి చీఫ్ షర్మిల

బీమా ఇవ్వకనే వేరుశనగ సాగు తగ్గుదల

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాను కరువు నుంచి శాశ్వతంగా గట్టెక్కించేందుకు కాంగ్రెసు హయంలో చేపట్టిన 'ప్రాజెక్టు అనంత'ను కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తూనే అటకెక్కించిందని ఎపి కాంగ్రెసు అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విమర్శించారు. నగరంలోని లలిత కళాపరిషత్ హాలులో ఆదివారం సాయంత్రం జరిగిన జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా షర్మిల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను నిశితంగా దుయ్యబట్టారు. రాయలసీమ ప్రాంతానికి సాగు,తాగునీరు అందించే లక్ష్యంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేపట్టిన హంద్రీనీవా ప్రాజెక్టు 90 శాతం అప్పటికే పూర్తయిందని తెలిపారు. తక్కిన పది శాతాన్ని ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపిలు ఎందుకు చేపట్టలేకపోయాయని ప్రశ్నించారు. అదే విధంగా కాంగ్రెసు హయంలో పంటనష్టపోతే రైతులకు పంటలబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ఆదుకున్నారని చెప్పారు. అయితే వైసిపి హయాంలో పంటలబీమా పూర్తిగా మాయమైందన్నారు. అందుకే అనంతపురం జిల్లాలో ఒకప్పుడు 20 లక్షల ఎకరాల్లో సాగయ్యే వేరుశనగ నాలుగైదు లక్షల ఎకరాలకు పడిపోయిందని తెలిపారు. ప్రాజెక్టు అనంత అమలు జరిగి ఉంటే వెనుకబడిన అనంతపురం జిల్లాకు ఎంతో మేలు జరిగుండేదని చెప్పారు. కాంగ్రెసు పార్టీ తీసుకువచిచన ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగానికి బిందు,తుంపర సేద్యం ఎంతో అవసరమని అన్నారు. దీనికి కూడా సబ్సిడీనీ తగ్గించారని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాల్లేవన్నారు. దీంతో వారు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రతి ఏటా జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న ప్రకటన తప్ప ఆచరణలో అమల్లో లేదని విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయించే విషయంలో కేంద్రంలోని బిజెపిని ప్రశ్నించలేని స్థితిలో రాష్ట్రంలో టిడిపి, వైసిపిలున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలు బిజెపికి బానిస పార్టీలుగా మారాయన్నారు. ప్రత్యేకహోదా, పోలవరాన్ని సాధించలేకపోయారని దుయ్యబట్టారు. అందుకే వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే సమయంలో ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెసు మరోమారు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల సమయంలో ఇంటింటికెళ్లి పై సమస్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడబ్లుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

4న ప్రజ్ఞ వికాస పరీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజ్ఞ వికాస పరీక్ష కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రముఖ విద్యావేత, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో వచ్చేనెల 4న జిల్లావ్యాప్తంగా టెన్త్ విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ తెలిపారు. ఈమేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పదో తరగతి విద్యార్థుల్లో ప్రతిభను బయటకు వెలికితీయడానికే ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4న ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకూ ప్రధాన పట్టణాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వైటిసి రమేష్, సిద్ధు, వంశీ, గిరి, రజిత, జిల్లా సహా కార్యదర్శులు సూర్యప్రకాష్, అశోక్, భీమేష్, జిల్లా కమిటీ సభ్యులు వంశీ, సోము, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజలే బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

బస్సుయాత్రకు భారీగా తరలివచ్చిన జనం

ప్రజలకు మంచిచేశానని చెప్పుకుంటున్న సీఎం జగన్‌కు ప్రజలే బుద్ధి చెప్పేరోజులు దగ్గరలో ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకరరెడ్డి అన్నారు. యువచైతన్య రథం బస్సుయాత్ర చివరి రోజు ఆదివారం పెద్దవడుగూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోకి జెసిపిఆర్‌తోపాటు తనయుడు అస్మిత్‌రెడ్డి రాగానే పూలు, హరతులతో ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో జగన్ ప్రజలకు ఏమిచ్చినా ఆయన మళ్ళీ వద్దంటున్నారన్నారు. తిరిగి టిడిపికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాగా కొందరు సామాజిక మాధ్యమాల్లో జెసి కుటుంబానికి ఎమ్మెల్యే సీటు దక్కలేదని చెబుతున్నారని.. ఎమ్మెల్యే ఒక్కటే కాదు.. రెండు సీట్లు సాధించుకుంటామని, అధినేత చంద్రబాబు కూడా తమకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇస్తాడనే ఖచ్చితమైన నమ్మకం ఉందన్నారు. ప్రజలు ఎవరిమాటా వినవద్దన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, లీలావతి, కమలమ్మ, దేవమ్మ, కొండూరు కేశవరెడ్డి, ఆవులాంపల్లి కేశవరెడ్డి, దివాకర్‌రెడ్డి, గంగరాజు, బాలిరెడ్డి, నారాయణస్వామి, హరినాథరెడ్డి, హరికృష్ణారావు, సుంకిరెడ్డి, పరమేశ్వరరెడ్డి, రమేష్‌యాదవ్, రవిశేఖరరెడ్డి, నాగన్న, బాషా, చిరంజీవులు, నగేష్, నాగరాజు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితో కలిసి పని చేద్దాం

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

లక్ష్మీపతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయ సాధన కోసం నాయకులు, కార్యకర్తలందరం టిడిపితో కలిసి పని చేద్దామని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఇందులో భాగంగా టిసి.వరుణ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయగూరల లక్ష్మీపతి వంటి సీనియర్ నాయకులు జనసేనలో చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. టిడిపితో కలిసి పనిచేసి అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన జెండా ఎగరవేస్తామన్నారు. జనసేన, టిడిపి ప్రజా ప్రభుత్వ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొదిలి బాబురావు, మురళీకృష్ణ, జయరామ్‌రెడ్డి, అంకే ఈశ్వరయ్య, కుమ్మర నాగేంద్ర, బాలసముద్రం, అమర, కార్తికేయ, సంజీవరాయుడు, ఇండ్ల కిరణ్‌కుమార్, సిద్ధు, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, సదానందం, గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్ బాషా, లాల్ స్వామి, రాజేష్ ఖన్నా, అంజి, సంపత్, ఆకుల అశోక్, జగదీష్, కాయగూరల లక్ష్మీప్రసాద్, అంజలి, అనసూయ, అరుణ, వర్షిత, ఎంసీ.బాలన్న (అడ్వకేట్), చిరు, రామాంజి, విజయ్ భాస్కర్, హీద్దూ, నజీమ్, బళ్లారి అనిల్, హరి, వంశీ, శిక్ష, సాదిక్, సురేష్, విజయ్‌రాయల్, నౌషాద్, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

5న మాదిగ మహాధర్నా

ప్రజాశక్తి-రాయదుర్గం

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 5వ తేదీన రాయదుర్గంలో మాదిగ మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్‌మాదిగ తెలిపారు. ఈమేరకు ఆదివారం రాయదుర్గంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జనాభా ప్రాతిపదికన రెండవ స్థానంలో ఉన్న ఎస్సీలకు ఒక అంబేద్కర్ భవనం నిర్మించాలన్నారు. అంబేద్కర్ విగ్రహానికి స్థలం కోసం పలుమార్లు అధికారులు, ప్రభుత్వ పెద్దలను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దసంఖ్యలో మాదిగలు ధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఆర్ పెన్నప్ప, నియోజకవర్గ అధ్యక్షులు వన్నూరుస్వామి, తాలూకా ఉపాధ్యక్షులు గోవిందు, తాలూకా ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు కోటి, రాము, హనుమంతు, మండల అధ్యక్షులు వన్నూరుస్వామి, గుమ్మగట్ట మండల ఇన్‌ఛార్జి సతీష్, పట్టణ అధ్యక్షులు మనోహర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఏసూప్ రాము, కణేకల్ మండల నాయకులు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రస్టేషన్‌లో చంద్రబాబు

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి అధినేతపై వైసిపి నాయకుల ఫైర్

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి శంకరనారాయణ

టిడిపి అధినేత చంద్రబాబు ప్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. ఆదివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణ, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాయలసీమ గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు వచ్చి తానే అంతా చేసినట్లు మాట్లాడటం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఓ మోసగాడు అన్నారు. హంద్రీనీవా నుంచి జిబికి నీరిస్తుంటే అడ్డుపడిన దుర్మార్గుడు కేశవ్ అని విమర్శించారు. జగన్ బాధితులంతా తన స్టార్ క్యాంపెయినర్స్ అని చెబుతున్న చంద్రబాబు పెత్తందార్లు, దళారీలు, బ్రోకర్లను స్టార్ క్యాంపెయినర్లుగా పెట్టుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

ఉరవకొండ : దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి ఫలితంగానే హంద్రీనీవా నుంచి రాయలసీమ జిల్లాలకు నీరొచ్చిందని ఎంపిపి నరసింహులు, పెన్నఅహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉరవకొండలో టిడిపి నిర్వహించిన 'రా కదలి రా' సభలో టిడిపి అధినేత చంద్రబాబుతోపాటు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. 40 టీఎంసీల హంద్రీనీవాను 4 టీఎంసీలకు కుదించి తాగునీటి ప్రాజెక్టుగా చేసిన చరిత్ర చంద్రబాబుది అన్నారు. అయితే దాన్ని 40 టీఎంసీలు పెంచి సాగునీటి ప్రాజెక్టుగా మార్చింది వైఎస్ఆర్ అని గుర్తు చేశారు. కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేని వీరు హంద్రీనీవా మేమే నిర్మించామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్ఆర్ ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన తనయుడు సిఎం జగన్ రెండడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. సొంత నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వలేని చంద్రబాబు హంద్రీనీవా నిర్మించారంటే ఎవరూ నమ్మరన్నారు. మరోవైపు ఉరవకొండను తానే అభివృద్ధి చేశానని, మరలా అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పయ్యావుల కేశవ్ ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నాడని ఎద్దేవా చేశారు. తన సొంత గ్రామం మీదుగా కళ్యాణదుర్గం వెళ్లే రహదారిపై కనీసం ఒక వంతెన నిర్మించుకోలేని అసమర్థుడు కేశవ్ అని విమర్శించారు. కాగా విశ్వేశ్వరరెడ్డిపై ఎవరైనా అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎవరు దౌర్జన్యపరులో.. ఎవరూ కబ్జాదారులో నియోజకవర్గ ప్రజలకే కాకుండా జిల్లా ప్రజలకు తెలుసన్నారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని లేనిపక్షంలో ప్రజలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ, రూరల్ సమన్వయకర్త ఓబన్నపట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, జెసిఎస్ కన్వీనర్ ఆసీఫ్, నాయకులు ఉలిగప్ప, ముష్టూరు బాబు, ఎర్రిస్వామిరెడ్డి, పచ్చి రవి, లింగన్న, జయరాం, చిన్న భీమా, భీమన్న, సంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సహజ వనరులను దోచుకుని.. దాచుకోవడం చంద్రబాబు నైజమని వైసిపి మైనారిటీ నాయకులు ఫ్లయింగ్ మాబు, నూర్ నిజామి, సీనియర్ నాయకులు మల్లికార్జున శాస్త్రి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ ఎమ్మెల్యే ఇసుక, రేషన్ బియ్యం దోపిడీ చేస్తున్నాడని, ప్రభుత్వ భూములు కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని చంద్రబాబు అసత్య ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఇలాంటి నికృష్ట చర్యలు చేసేది చంద్రబాబే అన్నారు. సిఎం జగన్‌ను ఓడించాలన్న దురుద్దేశంతో షర్మిలను కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేలా చంద్రబాబు పని చేశాడన్నారు. చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. ధర్మవరం రైల్వే గేటు స్థానంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి ఎంత కృషి చేశాడో ప్రజలకు తెలుసన్నారు. అయితే బ్రిడ్జి నిర్మాణంపై సీపీఐ రాష్ట్ర నాయకుడు జగదీష్ రాద్ధాంతం చేయడం సరైంది కాదన్నారు. ఆ రోడ్డులోని ప్రజలు, వ్యాపారులకు నష్టం జరుగకుండా ఎమ్మెల్యే రైల్వే అధికారులతో సమీక్షలు చేసి దాన్ని సాధించారన్నారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, నాయకులు బవన్న, మార్కెట్ వెంకటేశ, కౌన్సిలర్ చాండ్‌బాషా పాల్గొన్నారు.

గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి. రమణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి రమణ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో అఖిల భారత గిరిజన ఉద్యోగుల అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేర్చితే జరిగే నష్టాలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు అందజేశామన్నారు. అంతేగాకుండా అనేక రూపాల్లో పోరాటాలు చేశామన్నారు. అయినా రాష్ట్రంలో ఓటుబ్యాంకు రాజకీయాల కోసం గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపారన్నారు. వెంటనే ఆ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.అశోక్ నాయక్, డి రామాంజనేయులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రామానాయక్ ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీనాయక్, బాబునాయక్, నాయకులు చెన్నకేశవులు, గోపాల్‌నాయక్, గణేనాయక్, రవీంద్రనాథ్, తిరుపాల్‌నాయక్, డాక్టర్ బాలాజీనాయక్, రమేష్‌నాయక్, డాక్టర్ జయసూర్య, వంశీకృష్ణ, జయరాం, రవీంద్ర, మోహన్‌నాయక్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఐకమత్యంగా కృషి

మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్- జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్యవైశ్య సంఘం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న టి.జి.వెంకటేష్

జిల్లాలోని ఆర్యవైశుల అభివృద్ధికి ఆర్యవైశ్య సంక్షేమ నూతన సంఘం కృషి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆదివారం గుత్తి రోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాల్లో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశుల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లాలోని ఆర్యవైశ్య సంఘం పదవీకాలం పూర్తయినందున నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని ప్రమాస్వీకారం చేయడం సంతోషంగా ఉందన్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడు సిరుగుప్ప వెంకటేష్ సౌమ్యుడే కాకుండా ప్రతి ఒక్కరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగే వ్యక్తి అన్నారు. అలాంటి ఆయన ఆర్యవైశ్య సంఘం అభివృద్ధితోపాటు ఆర్యవైశ్యులను తన కుటుంబ సభ్యులుగా అభివృద్ధి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనకు ఆర్యవైశ్య సంఘంలోని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పోతుల సురేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తిరువీధుల జగదీష్, కలవల రామ్‌కుమార్, కోటా సత్యం, పార్థసారథి, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల

1న కలెక్టరేట్ ముట్టడి

ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 1న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిరంకుశ వైఖరి తరగన్నారు. ఇందుకు నిరసనగా 1వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్సీ రాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, మోహన్‌రెడ్డి, బొమ్మయ్య, పాపిరెడ్డి, గాయత్రి, సతీష్, కార్యదర్శులుగా డేనియల్ నరేష్, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.వెంకటేశ్వర్లు, హనుమప్ప, రామాంజనేయులు, సర్దార్‌వలి, రమణ, అంజలీదేవి, సుభద్ర, ప్రేమావతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వన్నప్పను ఎన్నుకున్నారు.

ఢిల్లీ పరేడ్‌లో అనంత యోగా శిక్షకులు కృష్ణవేణి ప్రతిభ

మొమెంటో అందుకుంటున్న కృష్ణవేణి

అనంతపురం : ఢిల్లోలోని పరేడ్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లాకు చెందిన యోగా శిక్షకులు కృష్ణవేణి పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ఆయూష్ శాఖ కేంద్ర మంత్రి శరభానంద్ సోనోవాల్ కృష్ణవేణికి మొమెంటో, సర్టిఫికెట్ అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. అది కూడా వెనుకబడిన అనంతపురం జిల్లా నుంచి ఢిల్లీలో యోగాసనాలు వేయడం సంతోషంగా ఉందన్నారు. కృష్ణవేణిని జిల్లాలోని ప్రముఖ నేతలు, అధికారులు, సామాజికవేత్తలు, సాహితీవేత్తలు అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం

బెలుగుప్ప : అనంతపురంలోని రియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వైద్యులు మోతుపల్లి ఉదయ్‌కుమార్, దేవినేని, గీత, స్వర్ణ హాజరై బిపి, షుగర్, థైరాయిడ్, గుండె, కిడ్నీ, రక్తహీనత వంటి పరీక్షలు నిర్వహించారు. ఆస్తమా ఊపిరితిత్తుల సమస్యలు, రొమ్ములో గడ్డలు, ఫైల్స్, ఫిస్టులా, హెర్నియా, కనతలు, పుండ్లు మొదలైన అన్నిరకాల జబ్బులకు వైద్య చికిత్స అందించడంతోపాటు మందులు అందజేశారు. వ్యాధి నిర్ధారణ అనంతరం పరీక్షలు అవసరమైన వారికి అతితక్కువ ఖర్చుతో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మోదుపల్లి లక్ష్మీప్రసాద్, ఆవులన్న సర్పంచి రామ్మోహన్, రియా ఆస్పత్రి సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 1992లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చదివేటప్పుడు ఉన్న ఉపాధ్యాయులు నారాయణస్వామి, చెక్ వీరాచారి, మద్దిలేటి రహమత్, బ్రహ్మాచారి, తదితరులను ఘనంగా సన్మానించారు. అనంతరం అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సోమనాథ్ బాబు, అమీర్ బాషా, గంజిగుంట ప్రభాకర్, లక్ష్మీనారాయణ, రామిరెడ్డి, మల్లెల శివయ్య, శివారెడ్డి, టోపేవలి, రసూల్‌ఖాన్, నాగరాజు, బెల్లం రాము, రమేష్‌నాయుడు, ఖాదర్ వలీ ఖాన్, శ్రీనివాసులు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో ఆదివారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి మోడల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, కోశాధికారి హనుమంతు ఇలాంటి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు పరీక్షలు అంటే భయం వీడి మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు. నేటి విద్యార్థులే రేపటి సమాజాన్ని మార్చే పౌరులుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమాజాన్ని మార్చే శక్తి కేవలం విద్యార్థులకు మాత్రమే ఉందన్నారు. ప్రతి విద్యార్థి పబ్లిక్ పరీక్షలు ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా రాయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి అంజనేయులు, శాంతిరాజు, శశి, మల్లికార్జున, ఎఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కుమార్‌నాయక్ పాల్గొన్నారు

జివిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సాకే పురుషోత్తం

ఉరవకొండ : జివిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉరవకొండకు చెందిన సాకే పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని జివిఎస్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కోర్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి రాష్ట్ర కోర్ కమిటీ ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కోర్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో జీవీఎస్ఎస్ ఆధ్వర్యంలో గిరిజనులతోపాటు విద్యా సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా గిరిజనులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

అనంతపురం కలెక్టరేట్ : ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ మానసిక వైద్య నిపుణులు గరుగు బాలాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.విష్ణుప్రియ హాజరై వైద్యపరీక్షలు నిర్వహించారు. దాదాపు ఏడు రోజులపాటు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓ.ప్రణతి, ఆర్ట్స్ కళాశాల జువాలజీ లెక్చరర్ జి.ఎల్.ఎన్.ప్రసాద్ పాల్గొని లింగ వివక్ష, బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కురుగుంట మాజీ ఎంపిటిసి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కే.జయమారుతి, ఎఎన్ఎస్ఎస్ రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత జి.నందిత, వాలంటీర్లు పాల్గొన్నారు.

మామిడి మొక్కలపై విష ప్రయోగం

విష ప్రయోగంతో ఎండిన మామిడి మొక్క

పెద్దవడుగూరు : మండలంలోని వీరన్నపల్లికి చెందిన టిడిపి నాయకుడు భరత్‌కుమార్ యాదవ్, రెడ్డప్ప పొలంలో సాగు చేసిన మామిడి మొక్కలపై గుర్తు తెలియని వ్యక్తులు విష ద్రావకం పిచికారీ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. తమకున్న 354-1, 189-1 సర్వేనెంబరులోని రెండెకరాల పొలంలో సంవత్సరం నుంచి సుమారు 120 మొక్కలను పెంచుతున్నాడు. ఈనేపథ్యంలో మొక్కలపై విషప్రయోగం చేయడం వల్ల పూర్తిగా నాశనమయ్యాయని వాపోయారు. భూ తగాదా విషయంలో ఇరువురి ఉన్న పాతకక్షల కారణంగానే మొక్కలపై విషప్రయోగం చేశారని బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ మధుసూదన్‌రావు, జమేదారు మనోహర ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శంకరరెడ్డి తెలిపారు.

##